# పరువు కోసం

## —నిష్ఠల వెంకటరావు

ఇంటర్‌కన్న ఎక్కువ చదివితే ఇక్కడ వుండకండి అంటూ జోగారావు, జగ్గారావులని పొమ్మంది వాళ్ళ వూరు. అక్కడ జూనియర్ కాలేజి దాటి లేదు. జోగ్రావు జగ్రావు అ ఆ ఇ ఈ బడినుండి మిత్రులు.

జోగ్ బి.య్యే, జగ్ బి. కామ్ చదవడం కోసం పెద్దపట్నం వచ్చేరు. వచ్చి దరిదాపు ఊరంతా కలియచూసేరు. వాళ్ళ చిన్నపట్నం ఈ వూరుముందు బాడుకావూరను కున్నారు. బాడుక్కి పట్నంలో రూమ్ తీసుకున్నారు. భోజనం అన్నపూర్ణ హోటలు. అల్పాహారాలు అప్సరా కేఫ్.

జగ్గారావుకి పెద్దపట్నం నీరూ గాలీ బాగా సోకేయి. చదువంటే బి.కామ్ గాని ఇతరత్ర బి.ఏక్టివ్ అయేడు. ఏదో తహతహ ఏదో కుతూహలం, ఎందుకోసమో ఆరాటం. కాటన్ పిల్లో దశ దాటి ఫోమ్ రబ్బర్ స్టేజికొస్తున్నాడు. బజార్లు, ఇంపాలా కార్లు మళ్ళే ఇంపార్టెంటు జంక్షన్లు, ఎలైట్ వీధులు దున్నేస్తున్నాడు. కాని—

సెకెండు టర్మ్ వచ్చినా (హీ ఖుజ్ వెరీ సారీ) ఒక్క బాల్చి అయినా తగల్లేదు, ఉట్టి గేలమే పైకి వస్తూంది. పెద్దపట్నంలో బకెట్లకి కొదువలేదని ప్రతీతి. బట్? వాటర్ వాటర్ ఎవ్విరి వేర్ బట్ నాట్ ఎ బకెట్ టు పిక్!

రానురాను ఇద్దరు మిత్రులు ఒహర్ని ఒహరు రూమ్‌లో ఉన్నపుడే చూసుకోవడం జరుగుతూంది.

జోగారావు బుద్ధిగా చదువుకుంటున్నాడు. కాని జగ్గారావు ఎప్పుడు చూసినా దువ్విన తలే దువ్వడం, స్నోలు రాయడం, పౌడర్లు అద్దడం సెంట్లు పులమడం, ఇన్‌షర్ట్, ఎన్నివేషాలు వెయ్యాలో అన్నీ వెయ్యడం. అయినా ఎన్ని చేసినా నైట్ ఆఫ్ ది సారోఫుల్ కాన్టినెన్స్ లాగ ఖిన్నవదనం!

ఓరోజు జోగారావు రూమ్‌కి తిరిగొచ్చేసరికి జగ్గారావు మహావిచారంలో వున్నాడు. కుర్చీమీద కాదు, కాట్‌మీద కాదు, కటిక నేలమీద కూర్చున్నాడు గోడకి చేరబడ్డాడు. రెండు మోకులలో బుర్ర పెట్టుకున్నాడు—

"బేడ్ లక్ బేడ్ లక్" అని గొణిగాడు అప్పుడే వచ్చిన జోగారావుని చూసి

"నీకు ఎప్పుడూ వున్నదే కదరా, ఇవాళ కొత్తేమిటి!" అన్నాడు జోగారావు తాపీగా, ఫిలసాఫిగ్గా.

"లేదుగురూ నిజంగా బేడ్‌లక్ అంటే నమ్ము" కొంచెం విచారం కొంచెం ఆవేశం జోడించి అన్నాడు. ఈసారి కొంపే మునిగిపోయినట్టు. ఇదేదో కొత్తరకం లాగవుంది అనుకుని జోగారావు.

"ఏమయింది అయితే?" అడిగేడు కొంచెం ఆశ్చర్యం నటిస్తూ. జగ్గారావు కథనం మొదలెట్టేడు.........

"నీకు తెలుసుకదా ఆ అమ్మాయిని ఓ మారు సెంటర్లో చూపెట్టేను (?) వైట్‌శారీ రెడ్ బ్లౌజు (?) ఇవాళ మధ్యాన్నం లస్ట్



ఆవడు టోరు కొట్టి మెయిన్ బజారులోకి వచ్చేను. అక్కడ కనపడింది—ఈసారి నీలం శారీ బ్లూ జాకెట్టు బంపర్లడ్డు గూమా.," ప్రస్తుతం విచార సమయం అయినా ఆ మూమెంట్ కేచ్ చేసే సరికి ఆ ఖుషారే వచ్చింది.

"అయితే?"

"అయితే ఏంటి, నవ్వేను—నవ్వింది. పలకరించేను-పలికింది, తోవలోకి వస్తుందను కున్నాను. ఎండగా వుంది డ్రింక్స్ సిప్ చేద్దాం అన్నాను. అలగే అంది. నేను లిమ్కా అంటే తనకి థమ్సప్ అంది. వెరీగుడ్ అదిరా రస్తా అనుకున్నాను. బార్‌లోకి వెళ్ళేం. ఓ కాళీ టేబిల్‌కి ఎదురుగా కూర్చు న్నాం. ఆర్డరిచ్చేం. సిప్ చేస్తున్నాం. మీద నుంచి కళ్ళతోను, అడుగునుంచి కాళ్ళతోను పరిచయం అభివృద్ధి చేసుకుంటున్నాం."

"ఆంతరంగికంగా ఆరమరికలు లేకుండా మాట్లాడుకుందాం. రూమ్‌కి వస్తారా?" అడి గేను

"రూమ్‌లో మీ రొక్కరేనా వుండేది?"

"నా ఫ్రెండు కూడా వుంటున్నాడు"

"వద్దండీ"

హోటల్లో రూం తీసుకుందాం

"..........." మౌనం ముప్పావు అంగీ కారం.

పైకొచ్చి గబగబా నడిచేను. తనూఫాలో అయింది. ఇహ చూస్కో అన్నిటికి ఒ ప్పేసుకుంటూంటే తబ్బిబ్బయి పోతున్నాను. లాడ్జి మెట్లు మహా ఉషారుగా ఎక్కేను. కౌంటర్ దగ్గిర కుర్రాడికి "టు డేస్"అంటూ ఎడ్వాన్సు రెండు టెన్నర్లు ఇచ్చేను. వాడి పాకెట్ కి బోనస్ అని ఓ ఫైవ్ పిసిరేను. ఆ దెబ్బతో వాడు ఐసయి పోయేడు. ఏవో మెలికలు తిరిగి చిన్న మెట్లు ఎక్కి దిగి ఓరూమ్ బీగం తెరిచి ఇచ్చేడు. నేను బీగమ్ రూమ్ లోకి వెళ్లేం.....

"తను సరదాగా రూమంతా శ్రద్ధగా ఆసక్తిగా చూసింది. ఎందుకైనా మంచిదని తలుపు గడియ పెట్టేను...తర్వాత అర్థాంగీ-కారం.......

"వాళ్ళెవరో పూర్తిగా తెలియకుండా రూమెందుకు ఇచ్చేవురా ఇడియట్? మనం నిజాయితీగా పోయినా రెయిడ్లు తప్పవు... పద....తలుపు తియ్యమను........" ఉంటూ ప్రొప్రయిటరో మేనేజరో మాకు రూమ్ ఇచ్చిన కుర్రాడిమీద కారాలు మిరియాలు నూరుతున్నాడు!

"మేం.... అదే ఆరంభంలో....తలుపు మీద దబదబ చప్పుళ్లు! నాగుండెలు ఎగిరి పోయేయి, పాపం అమ్మాయీ అలాగే ఆయింది. ఇహలేట్ చేస్తే ఆమెని ఎక్స్ పోజ్ చేసినట్టు అవుతుందని

"నేను ఇలాపైకి పోతాను. తలుపులేసి నువ్వు ఒక్కర్తివే ఉన్నావని చెప్పి తప్పుకో"

"వెంటనే కిటికీ తెరచి రూమ్ లోకి మెహం పెట్టి కాళ్ళు మెల్లిగా కిటికీలోంచి వెనక్కి పోనిచ్చి కిందకి జారబోతే పాదాకి ఏమీ తగల్లేదు. కిటికీపై అంచులుపట్టుకుని వేలాడి వున్నాను.

ఇంతట్లో రూమ్ తలుపు తీసింది. హోటలు వాడు "మగమనిషి ఏడి?" అని ఆమెని క్వెశ్చన్ చేస్తున్నాడు.

"నన్ను రూంలో ఉంచి వెంటనే ఆయన బజారుకి వెళ్ళారు" అంది సంజాయిషీలాగ.

హోటలు ఓనరు ఆమాటలు నమ్మి నట్టు లేదు. రూమ్ లో మంచం కింద టేబిల్ కింద చూస్తూన్నట్టు ఉన్నాడు. ఏమను కున్నాడో ఏమో వెంటనే పోలీసులకి ఫోన్ చెయ్యమని కుర్రాడికి ఆర్డరు వేసేడు.

"నేను అలావేళ్ళాడుతున్నాను. కాళ్ళలోకి రక్తం దిగిపోయింది. కీళ్ళలో రక్తం ఖాళీ అయి తిమ్మెరలు...మరోమూడు నిమిషాలు.. హోటల్లో పోలీసు బూట్లు టకటకలు...అలాగే వున్నాను.

"పైనకూడా పోలీసులు కాసినట్టు వున్నారు. ఒకడు నన్ను చూసేడు కాబోలు గజదొంగని అనుకున్నాడేమో దూరం నుంచే

"కిందకి జారిపోరా నాన్నా, స్టేషన్ కి పోదాం, రా" అన్నాడు.

అప్పుడు వాళ్ళమాటలు వస్తూన్నపక్క చూశాను. ఇద్దరు పోలీసులు లాఠీలు తిప్పుతున్నారు. ఇప్పుడు చెప్పు? నాది బేడ్ లక్ అవునా కాదా!" రెట్టించేడు జగ్గారావు.

"వెధవ పోలీసులు స్టేషన్ కి తీసుకెళ్తే వెళ్లేరుగాని అలాటి ఎక్స్ పీరియన్స్ బేడ్ లక్ ఏంటి గురూ?"- జోగారావు సర్దుబాటు.

"అదికాదురా బాబూ నేననేది. పాదాలకి ఏమీ తగలక పోయేసరికి రూమ్ లో ఏమవుతుందో అని కుతూహలంతో కిందకి చూడనే లేదు. పోలీసులు "జారిపోరా నాన్నా" అన్నాకే కిందకి చూసేనులేరా. చూస్తే నా పాదాలకి భూమికి ఓ అడుగు దూరమే వుంది! ఇప్పుడు చెప్పు బేడ్ లక్కేనా!"